శ్రీ రస్తు

శ్రీ మహాగణాధిపతయేనమః   శ్రీ గురుభ్యోనమః

కలియందు ముముక్షువులకు అత్యంతోపయోగముగా నుండుటకు అద్వైతమతసార సంగ్రహమును వ్రాయుచున్నాను. "జ్ఞానాదేవహి కైవల్యం అనగా జ్ఞానమే కైవల్యమునకు అనగా మోక్షమునకు సాధనము మరియొకటి సాధనము లేదని అద్వైత సిద్ధాంతానుసారముగా ప్రసిద్ధమయిన విషయమే. అవిద్యాస్తమయో మోక్షః సాచబంధ ఉదాహృతః అను వార్తిక వచనము ననుసరించి అజ్ఞాన నాశమే మోక్షమని. అజ్ఞానమే బంధమని" శ్లోనివృత్తి రాత్మా మోహస్యజ్ఞాతత్వేనోప లక్షితః అను వచనమునుబట్టి అజ్ఞానము జ్ఞానముచేత నశించిన తరువాత మిగిలిన ఆత్మయే మోక్షమని స్పష్టమగుచున్నది. అందువలన అజ్ఞానమనగానేమి జ్ఞానమనగానేమి ఆ యజ్ఞాననివృత్తి యటులనగును అవశిష్టమైన ఆత్మ స్వరూపమేమియని విమర్శించవలసిన విషయము. ఆత్మ సాక్షాత్కారము కొరకు శ్రవణమనననిది ధ్యాసనలను చేయవలయునని బహు పర్యాయములు చెప్పిన విషయమే. శబ్దాదులను శ్రోత్రేంద్రియములచే తెలిసికొనుచున్నాము. ఆయా విషయములను ప్రత్యక్షాది ప్రమాణములతో తెలిసికొనుచున్నాము. ఆత్మను ఏ ప్రమాణముతో తెలిసికొనవలయును అను విషయం ముఖ్యం. రూపము లేనిది గనుక కంటితో తెలిసికొనలేము. స్పర్శలేనిది గనుక త్వగింద్రియముతో తెలిసికొనలేము శబ్దముకాదు గనుక శ్రోత్రేంద్రియముతో తెలిసికొనలేము. రసగంధాదులు కాదు గనుక రసనేంద్రియముతోగాని, ఘ్రాణేంద్రియముతోగాని గ్రహించుటకు శక్యముకాదు.

ధూమముతో వహ్నిని గ్రహించినట్లు ఒక చిహ్నముతో గ్రహించుటకు వీలులేదు చిహ్నము లేదు గనుక. ఉపమానముతో గ్రహించుటకు దేనితోను సాదృశ్యములేదు గనుక వీలులేదు. ఇంతకేమి ఏ ప్రమాణము

చేతను గ్రహించుటకు సాధ్యముకాదు గనుక, ఆత్మసాక్షాత్కారము లేనిది బంధమునకు కారణమగు అజ్ఞానము నశించదు గనుక. ఆత్మసాక్షాత్కార సాధనమగు ఆత్మవిచారము అనగా శ్రవణాదులు ఏ విధముగా చేయవలె నని మొదట తెలిసికొనవలెను.

మరియు ఆత్మ అద్వితీయమని అనగా రెండవ వస్తువు లేనిదని, నామరూపక్రియలు లేనిదని, అస్థూలం అనణు అహ్రస్వం అదీర్ఘం అను శ్రుతినిబట్టి స్థూలముకానిది అణువుకానిది దీర్ఘము కానిది హ్రస్వము కానిది అనగా లావుగాని సన్నముగాని పొడవుగాని పొట్టిగాని పరిమాణము లేనిదని తేలుచున్నది. నిష్కలం నిష్క్రియం శాంతం అను వచనమును బట్టి అవయవములులేనిది చలనములేనిది ప్రశాంతమయినదియని అర్థ మగుచున్నది. అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం అను వచనమునుబట్టి శబ్దస్పర్శాది గుణములు లేనిదని స్పష్టమగుచున్నది. ఈ విధముగా ఆత్మ అద్వితీయమని తెలిసికొనవలయును. ఒక మామిడిపండు ఒకటియే యున్నది. అది అద్వితీయముకాదు. దానికి పండు అను పేరు కలదు. రూపము కలదు, దానికి రసము కలదు, గంధము కలదు, స్పర్శ కలదు, అవయవములు కలవు అనగా ముక్కలు చేయవచ్చును. దానికి బరువు కలదు. లావు, పొడవు మొదలగు పరిమాణములు కలవు. ఇన్ని లక్షణము లతో కూడిన ఫలము ఒకటి అయినను అద్వితీయముకాదు అనేక ధర్మ ములు ఉన్నవి గనుక.

ఇవి ఏవియులేనిది ఆత్మయని శ్రుతిస్మృతులు చెప్పుచున్నవి. నిర్వికారమయిన, అద్వితీయమయిన ఆత్మస్వరూపమును అట్టి స్వరూపు డనే నేను అని తెలిసికొనుట ఎంత కష్టమో గమనించండి. కాని ఈ విధంగా గ్రహించవచ్చును. ఆత్మజ్ఞాన స్వరూపము జ్ఞానము జ్ఞేయముకంటే వేరు. అనగా తెలియబడే పదార్థములకంటే తెలియచేయు జ్ఞానము వేరు. నామముగాని రూపముగాని, శబ్ద స్పర్శాదులుగాని క్రియలు గాని స్థూల సూక్ష్మాదులుగాని జన్మమరణాది వికారములుగాని అన్నియు తెలియబడేవే. వీనికంటే తెలియచేయు జ్ఞానము వేరుగానున్నది. ఏది ఏది

తెలియచేయబడునో అది పరమాత్మ కాదు. అట్టి జ్ఞానస్వరూపమగు పరమాత్మకు నామరూపాదులు తెలియబడునవి అంటవు గనుక ఆత్మ నిర్గుణము, నిర్వికారము, అద్వితీయమని గ్రహింపవలయును.

జాగ్రత్ప్రపంచమను దృశ్యము లేకపోయినను స్వప్నావస్థయందు మనస్సుతో కల్పింపబడిన స్వప్న దృశ్యములను తెలియచేయు జ్ఞానస్వరూపము కలదు. స్వప్న ప్రపంచము లేకపోయినను జాగ్రదవస్థయందు జాగ్రత్కాలమందలి పదార్థములను తెలియచేయు జ్ఞానస్వరూపము కలదు. జాగ్రత్కాల దృశ్యములు స్వప్న దృశ్యములు లేకపోయినను, గాఢ సుషుప్తియందు అనగా గాఢ నిద్రాసమయమందు ఏమి తెలియకుండా సుఖముగా నిద్రించితినని మెళకువ వచ్చిన తరువాత స్మరించుచున్నాడు గనుక సుషుప్తికాలమందు కూడా అవిద్యను ఆనందమును తెలియజేయు జ్ఞాన స్వరూపము కలదనే స్పష్టమగుచున్నది. కాని జ్ఞేయములేని సమయములో జ్ఞానమున్నట్లు, జ్ఞానములేని సమయములో జ్ఞేయమును రుజువు చేయగలమా? చేయలేము. కుండలు మొదలగు వికారములు లేని సమయమందు మట్టిని రుజువు చేయగలముగాని మట్టిలేని సమయంలో కుండలు ముంతలు మున్నగు వికారములను నిరూపింపగలమా? భూషణములులేని సమయంలో సువర్ణమును చూపించగలం కాని, సువర్ణంలేని సమయంలో భూషణములను చూపించగలమా? గనుక వికారములకన్న ప్రకృతిని వేరుగా తెలిసికొనగలముగాని ప్రకృతికంటే వేరుగా వికారమును తెలిసికొనలేము గనుక జ్ఞానరూపమగు పరమాత్మకంటే జ్ఞేయమగు ద్వైత ప్రపంచము వేరుగా లేదని గ్రహింపవలయును.

మరియు జ్ఞానమే మోక్ష సాధనమని అద్వైత సిద్ధాంతము ఆ జ్ఞానము ఆత్మజ్ఞానమే. అది అపరోక్ష జ్ఞానము. ఆత్మవిషయక అపరోక్ష జ్ఞానముచేత ఆత్మావరక అజ్ఞానము నశించునుగాని వేరు ప్రయోజనంలేదు. అయినపుడు బంధనివృత్తి యటుల కలుగును, ఆనందావాప్తి ఎటుల కలుగునని శంక కలుగవచ్చును. జన్మమరణాది సంసార

బంధము అజ్ఞానకల్పితమయినపుడు అజ్ఞానము నశించగానే భ్రమరూప మగు జన్మమరణాదులు కూడా నశించును. భ్రమ పోయిన తరువాత ఆత్మయే మిగులును. ఆ యాత్మ స్వప్రకాశ ఆనంద స్వరూపము. ఇట్టి భ్రమ సిద్ధాంతం బాగా తెలిసిన యెడల సర్వ సందేహములు పోగలవు. భ్రమయనగా ఒక వస్తువు మరియొక వస్తువువలె కనిపించుటయే. శుక్తి అజ్ఞాతమయి వెండివలె తగరంవలె గోచరించుట భ్రమ. తాడు అజ్ఞాతమయి సర్పంవలె తీగవలె భూమియందు గీతవలె గోచరించుట భ్రమ. ఆ భ్రమకు మూలమగునది అజ్ఞానమే. ఆ యజ్ఞానము అధిష్ఠాన మును అనగా అసలు వస్తువును ఆవరించును. అట్టి సమయంలోనే భ్రమ కలుగును. పరిశీలించిన శుక్తియని తాడని ప్రత్యక్షముగా జ్ఞానం కలిగినపుడు దీపమువలన చీకటి పోయినట్లు అజ్ఞానము నశించును. అజ్ఞానము నశించగానే రజత భ్రాంతియు సర్పభ్రాంతియు నశించును.

అటులనే జీవత్వ ఈశ్వరత్వ ప్రపంచ భ్రమకు ఆత్మయే అధిష్ఠానం. అనగా ఈ భ్రమకు మూలభూతమగు అజ్ఞానం పరమార్థ మగు ఆత్మను ఆవరించినది ఆత్మయనగా అందరు నేను అనుకొనునది కాదు. ఇది స్వప్నమందు సప్త ద్వీపాధిపతియగు ఒక మహారాజు అరణ్య ములో అనేక బాధలు పడుచు ఒక భిక్షుకునివలెనే నగుట యెట్టిదో అట్టిది అజ్ఞానముచేత ఆవరింపబడిన ఆత్మ ఉపనిషత్తులచే బోధింప బడు సత్యజ్ఞానానంద స్వరూపమగునది. అదియే జీవులందరికిని పర మార్థము. ఇపుడు నేను అనుకొనునది స్వప్నదృశ్యము లాంటిది. నిద్ర పోకమందు మహారాజు హంసతూలికా తల్పమందు సుఖముగా నున్నవాడు స్వప్నమందు ఒక అరణ్యములో దైన్యమును పొంది ఒక బురద మడుగులోపడి వంటినిండా బురద బాధ ననుభవించుచుండును.

ఇంతలో పిడుగు మహాధ్వనితో పడినట్లు కలరాగానే మెళుకువ వచ్చి చూడగా స్వప్నమందు భాసించిన దైన్యము బురద యేమాత్రం అంట లేదు మామూలు మహారాజుగానే యున్నాడు. ఈ రాజభావం పోనూ లేదు, స్వప్న దైన్యభావము రానూలేదు. మనోవృత్తి మాత్రమేకాని వస్తు స్థితిలో మార్పు జరగలేదు. అటులనే వేదాంత వేద్యమగు నిత్య

స్వతఃశానంద రూపమగు పరమాత్మయందు నిద్రవలె అజ్ఞానం ఆవరించుటచేత స్వప్నమువలె నేను జీవుడను. జన్మమరణములో నున్నాను. నాకంటే వేరుగా ఈశ్వరుడున్నాడు. ప్రపంచం వేరుగా నున్నది. లోకములు వేరుగా నున్నవియని భ్రమ కలిగినది.

శాస్త్రోక్త ప్రకారం సద్గురు పరదేవతానుగ్రహమును సంపాదించి శ్రవణమనననిది ధ్యాసనలు చేయగా మెళుకువవలె ఆత్మసాక్షాత్కారము కలుగగానే నిద్రవలె అజ్ఞానంపోయి స్వప్నము పోయినట్లు జీవత్వ ఈశ్వరత్వ ప్రపంచ భ్రమ నశించును. ఇదియే మోక్షము. స్వప్న దృశ్యమువలె భ్రాంతి సిద్ధమగు జీవభావము జన్మమరణములు ఆత్మకు అంటవు. గనుకనే ఆత్మ నిర్గుణము, నిర్వికారము, అద్వితీయమని తెలిసికొనవలెను ఈ సిద్ధాంతము ముఖ్యముగా తెలిసికొనవలసిన విషయము గనుకనే కొన్ని పర్యాయములు వ్రాసినను (పునరుక్తియని) వ్రాసిన విషయమే వ్రాసిరని. తెలిసిన విషయమే కదాయని అనుకొనకుందురుగాక యని నా అభిప్రాయము.

ఆత్మస్వరూపమేమి యనగా ఉపనిషత్తులు సత్యస్వరూపమని, జ్ఞానస్వరూపమని, ఆనంద స్వరూపమని ఉపనిషత్తులు బోధించుచున్నవి. ఇచట ఒక ప్రశ్న పరబ్రహ్మ అనగా పరమాత్మ నానారూపములులేని నిర్వికారం అని సిద్ధాంతం అయితే సత్యమనే పదము సత్యస్వరూపమును బోధించును. జ్ఞానమనే పదము జ్ఞానస్వరూపమును బోధించును. ఆనందమను పదము ఆనంద స్వరూపమును బోధించును. ఈ విధముగా మూడు ధర్మములుకల బ్రహ్మనిర్గుణము ఏకరసము ఎటులగును. మూడు పదములకు ఒకే అర్థమయ్యే యెడల ఒకే పదము చాలునుకదా. ఆ ఒక పదముతో బోధింపబడు తత్వమునే తక్కిన పదములు బోధించుచున్నవి గనుక తక్కిన పదములు వ్యర్థము కావలసివచ్చును అని ప్రశ్నించినపుడు సమాధానమిట్లు చెప్పవలయును.

పరమాత్మ నిరాకారము అనగా దృశ్యమగు ఆకారరహితము. కాని నిస్స్వరూపము కాదు. అనగా స్వరూపములేనిది కాదు. ఆత్మకే

స్వరూపము లేనియెడల జీవేశ్వర జగత్తులకు స్వరూపము లేకపోవలసి వచ్చును. మట్టికి స్వరూపము లేకపోతే ఘటాది వికారములకు స్వరూపం వచ్చునా? సువర్ణమునకు స్వరూపం లేకపోతే భూషణమునకు స్వరూపం వచ్చునా? శుక్తికి స్వరూపం లేకపోతే రజతం భాసించునా? గనుక సర్వ ప్రపంచమునకు అధిష్ఠానమగు బ్రహ్మకు స్వరూపం కలదు ఆ స్వరూప మేమియని ప్రశ్నించిన నామరూప జాత్యాదులు లేనిది గనుక వేదములు శాస్త్రములు వాఙ్మయమంతయు ఇది ఫలానిదని బోధింపజాలక ఆరోప నిషేధ పూర్వకముగా పరమాత్మను బోధించుచున్నవి గనక సత్యం, జ్ఞానం, ఆనందం అను పదములన్నియు ఒకే తత్వమును బోధించు చున్నవి.

సత్యమను పదము నాశము లేనిదని బోధించుచున్నది ఆ నాశము లేని వస్తువు జడపదార్థము కావచ్చుకదాయని ప్రశ్న కలుగునని, జ్ఞాన మను పదం జ్ఞానమనగా చేతనము జ్ఞానము కానిదంతయు జడమని గ్రహించవలయును. సత్య జ్ఞాన పదములతో నాశము లేనిది జడము కానిది పరప్రకాశ్యము కానిదియని తెలిసినది. జీవునికి కావలసినది దుఃఖనివృత్తి ఆనందావాప్తి నిత్యమగు చేతనమన్నంత మాత్రంతో పురుషార్థ సిద్ధి కాలేదు. అందువలన ఆనందమను పదము అనగా సుఖ స్వరూపము. సుఖస్వరూపమని చెప్పుటచేత దుఃఖములేనిదని స్పష్టమగు చున్నది. మూడు పదములు విషయ సుఖమువలె నశించునదికాదు ఇతర ప్రమాణములతో తెలియబడునదికాదు నిత్యస్వప్రకాశానందమని బోధించు చున్నవి. దానికి దృష్టాంతము సుషుప్తి దశ. సుషుప్తి సమయమందు సర్వజీవులకు ఆనందము గోచరించుచున్నది. ఆ యానందము విషయ సంబంధం వలన కలిగినది కాదని అందరకును అనుభవసిద్ధమే. ఆ యానందం అందరి జీవులకు సమానమేకాని హెచ్చుతగ్గులు లేవు. ఆ యానందమును తెలియచేయు సాధనములేమియు లేవు. మనస్సుకూడా ఆ సమయములో అజ్ఞానములో లీనమయినదని చెప్పుచున్నవి (సుషుప్తి కాలేసకలేవిలినే అని) గనుక ఆ యానందము స్వయముగా గోచరించు చున్నది గనుక స్వప్రకాశమని చెప్పవలయును. ఈ విషయంలో సర్వజ్ఞ ముని సంక్షేప శారీరకమను గ్రంథంలో ఇట్లు చెప్పిరి.

శ్లో॥ సత్యేప్యస్తి జ్ఞానతా జ్ఞానతాయాం సత్యత్వంచ స్పష్ట
మస్త్యేవతద్వత్
సత్యప్యేవం నాతిరేకావకాశః పూర్ణే తత్వేజ్ఞాన సత్యోపపత్తేః

శ్లో॥ ఆనందత్వే జ్ఞానతా జ్ఞానతాయాం ఆనందత్వం విద్యతే
నిర్విశంకం
సత్యప్యేవం నాతిరేకావకాశః పూర్ణేతత్వేజ్ఞాన సౌఖ్యోపపత్తేః

శ్లో॥ ఆనందత్వే సత్యతా సత్యతాయాం ఆనందత్వం
నిర్వివాదం ప్రసిద్ధం
సత్యప్యేవం నాతిరేకావకాశః పూర్ణే తత్వే సత్య
సౌఖ్యోపపత్తేః

ఈ శ్లోకములకు తాత్పర్యము వేదాంత వాక్యములన్నియు ఇతరములు అనగా ఆరోపితములు కాదంటూ లక్ష్యమగు పరబ్రహ్మయందు పర్యవసానమును పొందుచున్నవి. ఇదియే సర్వేషానాం వేదాంతానాం అద్వితీయే బ్రహ్మణి సమన్వయః అను వాక్యమునకు అర్థము బ్రహ్మ సత్యము. అసత్యముకాదు, నశించునదికాదు, అసత్యమై నశించు ప్రపంచముకంటే భిన్నము అనగా నశించు దృశ్యములలో చేరదని సత్యపదం చెప్పుచున్నది.

అది నశించనిదైనను జడముకావచ్చును. కదాయని శంకను పోగొట్టుటకు జ్ఞానపదం జ్ఞానం అనగా తెలియచేయబడు జడపదార్థముకాదు. అనగా జడపదార్థములతో చేరదు పరమాత్మ అని చెప్పినట్లైనది. నాశము లేదని చెప్పిన సత్యపదం జడంకాదని చెప్పిన జ్ఞానపదం. ఒక పదార్థము కలవి యని ఎట్లు తెలుసుకొనవలయును. అనగా ఆ నాశము లేనిది జడము కానిది. బ్రహ్మ ఒకటియేగాని అనగా ఏకరసమేగాని భిన్నాకారము కాదని తేలినది నాశము లేనిదని బోధించుచు సత్యపదం లక్ష్యమైన బ్రహ్మనే బోధించెను. జ్ఞానం అను పదం జడముకాదంటూ ఏకరసమగు బ్రహ్మనే బోధించుచున్నది. సత్యపదమునకు లక్ష్యార్థము. జ్ఞానపద లక్ష్యార్థము ఒకటియేగాని వేరుకాదు. (పూర్ణేతత్వే జ్ఞానసత్యోపపత్తేః అని చెప్పిరి)

నాశము లేనిదైనను జడము కానిదైనను దుఃఖరూపమైన, సుఖరూపము కానియడల పురుషార్థము కానేరదు. కదాయని శంకకు సమాధానం ఆనంద మను పదం కూడా సుఖభిన్నంకాదు. అనగా దుఃఖరూపము కాదని బోధించుచునే లక్ష్యమగు బ్రహ్మయందు పర్యవసానము పొందినది. ఆ యానందం గోచరించనియడల ఉపయోగము లేదుకదాయంటే జ్ఞానం అని చెప్పిరి. ప్రకాశమానమని యర్థము. యల్లపుడు ఆయానందం అనుభవ రూపముగా నుండునని తార్పర్యము.

అనగా జ్ఞానపద లక్ష్యం ఆనందపద లక్ష్యం సత్యపదలక్ష్యం ఒకటియేగాని వేరుకాదు. వ్రాసిన విషయమునే వ్రాసితినని ఎవ్వరు అనుకొనవద్దు ఎంత వ్రాసినను ఎన్నిమారులు వ్రాసినను పెద్దలవలన సంప్రదాయసిద్ధ శాస్త్రజ్ఞాన సంపన్నుల వలన శ్రవణంచేసి సందేహములను పోగొట్టుకొనవలెను. ఆ తరువాత ఇలాంటి గ్రంథములు చూచిన యడల విషయములను భవామాధమగును. అనంతం। నిత్యం నిష్క్రియం నిరంజనం మొదలగు పదములన్నియు ఆయా ధర్మములు లేనిదని బోధించుచు లక్ష్యమగు పరమాత్మయందు సమన్వయించినవని తెలిసికొనగలరు,

ఆరోప నిషేధము చేయుచునే అధిష్ఠానమగు ఆత్మను తెలిసికొనవలెనుగాని వేరుమార్గములేదు. ఆరోపనిషేధముచేయగా మిగిలిన తన స్వరూపమే అద్వితీయ బ్రహ్మ అదియే జీవబ్రహ్మైక్యము అదియే మోక్షమని గ్రహించపలెను అధిష్ఠానా వశేషో హినాశః కల్పితవస్తునః. అనగా కల్పిత వస్తునాశము అధిష్ఠానమే మిగులుదగా కలది అనగా మిగిలే ఆత్మయేయని యర్థము. శంకరాచార్యులవారు తదేకో వశిష్టశివః కేవలోహం అని చెప్పిరి. వ్యాసులవారు. శ్రీ మద్భాగవతమందు ముక్తిర్హిత్వాన్యథా రూపం స్వరూపేణ హ్యవస్థితిఃయని చెప్పిరి. అనగా అన్యథారూపం అజ్ఞాన కల్పిత జీవభావమును వదిలి మిగిలిన స్వరూపముతో ఉండుటయే ముక్తియని యర్థము.

సంక్షేప శారీరకమందు.

శ్లో॥ స్వాజ్ఞాన కల్పిత జగత్పరమేశ్వరత్వ
జీవత్వ భేదకలుషీకృత భూమభావా
స్వాభావిక స్వమహిమస్థితి రస్తు మోహప్రత్యక్చితిర్వి
జయతే భువనైక యోనిః॥

ప్రశ్న ప్రపంచము ఎవరు చేసిరి అనగా స్వాజ్ఞాన కల్పిత అను పదముతో శుక్తి రజతమువలె ఆత్మావరక అజ్ఞానముచేతనే గోచరించుచున్నది. ఆ యజ్ఞానముచేతనే జీవులు ఈశ్వరుడుకూడా గోచరించుచున్నారు. అని చెప్పిరి. అనగా అజ్ఞానముచేత నావరింపబడిన ఆత్మయే ప్రపంచమువలె జీవులవలె ఈశ్వరునివలె గోచరించుచున్నది. కాని ఆత్మ కంటే వేరు వస్తువు ఏమియు లేదని యర్థము, మరియొక విధముగా విచారించవలెను.

శుక్తియందు వెండి గోచరించుచున్నది. ఆ వెండి వస్తుధర్మమా అనగా శుక్తి ధర్మమా శుక్తియందున్నదా లేక భ్రాంతిని పొందినవానిమనోధర్మమా శుక్తియందే వెండి ఉన్న యెడల భ్రాంతిలేని వానికిగూడా కనపడవలెను. అటుల కనపడుటలేదు. భ్రాంతి కలవానికే గోచరించుచున్నది. గనుక ఆ రజతము మనోధర్మమే కాని వస్తుధర్మముకాదు. రజతాకార వృత్తి అవిద్యా వృత్తి అయినను, ఇదమాకారవృత్తి అంతఃకరణ వృత్తి గనుక అంతఃకరణ ప్రవృత్తితోనే భ్రమకలిగినది అందువలన మనోధర్మమని వ్రాసితిని గాని అపసిద్ధాంతమని పెద్దలు గ్రహింపకుందురుకాక। శుక్తియందు రజతభ్రమ। తాడుయందు సర్పభ్రమ। సర్పమందు తాడు యను భ్రమ ఎండమావులయందు జలప్రవాహమను భ్రమ, గురిగింజల గుత్తియందు అగ్నియను భ్రమ, ఆకాశము నల్లగానున్నదను భ్రమ. అద్దంలో ప్రతిబింబభ్రమ. యెండలోనించి వచ్చినవారికి వెల్తురున్నను చీకట్లు కమ్మినట్లు భ్రమ. జపాకుసుమ వద్ద స్ఫటికమందు స్ఫటికము ఎరుపుగానున్నదని భ్రమ జిహ్వాదోషమున్నపుడు తియ్యని బెల్లంముక్కయందు చేదుగానున్నదని భ్రమ. నేత్ర దోషమున్నపుడు తెల్లని శంఖము పచ్చగా నున్నటుల భ్రమ ఒక చంద్రుడు ఇద్దరు చంద్రులవలె భ్రమ.

రైలులోకాని వేగముగావెళ్ళి ష్టీమరులోకాని ప్రయాణం చేయుచున్న పుడు కొంత దూరములోనున్న చెట్లు పరిగెత్తుతున్నట్లు మరీ దూరముగా నున్న మనుష్యులు నడుచుచున్నను నిలుచున్నట్లు భ్రమ స్వప్నమందు దేశమంతా తిరుగునట్లు భ్రమ పైత్య వికారం వచ్చినపుడు భూమిఅంతయు తిరిగినట్లు భ్రమ ఈ మొదలగు భ్రమలన్నియు భ్రాంతిని పొందినవాని మనోధర్మమేకాని వస్తు ధర్మము కాదు। అటులనే ఆత్మయందు కలిగిన జీవేశ్వర జగద్భ్రమ భ్రాంతి కలవాని మనోధర్మమేకాని ఆత్మధర్మము కాదు నిజముగాలేదని బాగుగా విచారించవలసిన విషయం.

ఈ భ్రాంతి వృత్తి అనాది నుండి ఘనీభవించిపోయినది. అభేద్యముగా నున్నది. ఎంత శ్రవణం చేసినను అనివార్యముగానున్నది. గనుక పెద్దల వలన బహుకాలం శ్రమణం చేయుట సద్గురు పరదేవతారాధన సగుణారాధన నిష్కామ కర్మానుష్ఠానం చేసి అంతఃకరణ శుద్ధిని సంపాదించనిది జగన్మిథ్యాత్వ నిశ్చయం కలుగదు ఆ తరువాత ఆత్మసాక్షాత్కారం కలుగును గనుక సాధకులు ముఖ్యముగా మనోనిగ్రహము కొరకు ఈశ్వరారాధన చేయవలెను॥ దృశ్యమంతయు మనోధర్మం గనుకనే విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథానిద్రయా అని శంకర భగవత్పాదులవారు చెప్పిరి. దృశ్యము తనలోనున్నదని ఆత్మయందే గోచరించుచున్నదని నిద్రాదోషమువలన ఆత్మయందు లోపల ప్రపంచం గోచరించినను బైటకనిపించినట్లుగా నున్నది. అటులనే జాగ్రత్ప్రపంచం కూడా అంతర్గతమైనను బాహ్యముగా గోచరించుచున్నదని యర్థము. యోగవాసిష్ఠమందు వసిష్ఠమహర్షి "మనోమనన నిర్మాణ మాత్రమే తజ్జగత్త్రయం" అని చెప్పిరి. అనగా మనోవృత్తి మాత్రమేకాని జగత్తు వేరు లేదు అని యర్థము.

శ్లో॥ మనోదృశ్య మిదంద్వైతం యత్కించిత్స చరాచరం
మనసోహ్యమనీ భావేద్వైతం నైవోపలభతే।

అనిగౌడపాదులవారు చెప్పిరి. అనగా దృశ్యప్రపంచ మంతయు మనోవృత్తియేకాని వేరులేదు. జాగ్రదవస్థయందుకాని స్వాప్నావస్థ యందుగాని మనస్సు పని చేసినపుడే ప్రపంచముకాని శరీరేంద్రియములు గాని మనస్సు వృత్తిరహితమైనపుడు యే దృశ్యము గోచరించదు. గనుక దృశ్యమంతయు మనోవికారమేగాని వేరుకాదు. ఆ మనస్సు అజ్ఞానము వలన ఏర్పడినది గనుక జ్ఞానముచేత అజ్ఞానము పోగానే తన్మూలమగు మనస్సు మనోదృశ్యములును నశించును.

'ఈ విషయంలో ఒక ప్రశ్న' జ్ఞానమనగానేమి చైతన్య మనే యద౨ చైతన్యము అనగా ఆత్మ అజ్ఞానమును పోగొట్టే యడల అందరిలో చైతన్యమున్నది. గనుక అందరికిని అజ్ఞానముపోయి ముక్తి రావలసి వచ్చును. మరియు చైతన్యము అన్ని దృశ్యములను భాసింపచేయును అనగా తెలియచేయును. అజ్ఞానమును భాసింపచేయు చైతన్యము అజ్ఞాన మును నివర్తింపచేయదు. అంతఃకరణ వృత్తిరూపమగు జ్ఞానమే అజ్ఞానమును పోగొట్టునని చెప్పవలెను. ప్రపంచంలో యే వస్తువు నాకు తెలియదంటు న్నామో ఆ వస్తువును తెలిసికొన్న తరువాత ఆ వస్తువుయందలి అజ్ఞానము పోవుచున్నది. యే వస్తువుయందు చీకటి ఆవరించునో ఆ వస్తువుయందు వెల్తురు ప్రవేశించినయడల ఆ చీకటి పోవుచున్నది. చైతన్య ప్రతిబింబ ముతో కూడిన మనోవృత్తి యను జ్ఞానముచేతనే అజ్ఞానము నశించును. గనుక శ్రవణమననని దిధ్యాసనలు చేసిన పిమ్మట తత్వమస్యాది వాక్యార్థ మగు అఖండ బ్రహ్మకార అంతఃకరణ వృత్తి రూపమగు బ్రహ్మసాక్షా త్కారముచేత మూలాజ్ఞానము నశించును బ్రహ్మసాక్షాత్కారమన్నను ఆత్మ సాక్షాత్కారమన్నను, చరమవృత్తియన్నను, అఖండాకార వృత్తి యన్నను ఒకే అర్థముకాని వేరుకాదు. ఒకప్రశ్న అంతఃకరణ అజ్ఞా నము నుండి పుట్టినదికదా కారణమైన అజ్ఞానమును ఎటుల పోగొట్టును అంటే। ఒక అరణ్యములో ఒక చెట్టుకొమ్మను గొడ్డలికి తొడిగిరి ఆ గొడ్డ లతో ఆ గొడ్డలి కర్రకు కారణమైన చెట్టును అరణ్యము నంతయు నరికి వేయవచ్చును చ్ఛేదించివేయవచ్చును. అటులనే అజ్ఞాన కల్పిత సంసారా రణ్యమును అజ్ఞానమునుకూడా అజ్ఞానమునుండి పుట్టిన అంతఃకరణ

వృత్తి అనగా బ్రహ్మాకారవృత్తి ఇనపగొడ్డలిలాంటి చైతన్య ప్రతిబింబ ముతోకూడిన అజ్ఞాన తత్కార్య అరణ్యమును నశింపచేయునని సమాధానం చెప్పుకొనవలెను.

“అద్వైత సిద్ధాంతము। అంతయు ఆత్మయందు కలిగిన భ్రాంతియే కదా అయినపుడు భావనయేకాని వస్తువుమారలేదుకదా ఈ విషయములో ఒకకథ। ఒకమహారాజు సంస్థానంలో భర్తృ అను పేరుగల ఒక మహా పండితుడుండెను. ఆ పండితుడు చాలా మంచివాడు ఆయనయందు రాజుగారికి చాలా గౌరవభావన కలదు. ఆ పండితునికి కూడా ఆ రాజుగారియందు చాలా అభిమానము ఈ విధంగా కాలము గడుచుచుండగా కొంతమంది పండితులు ఇతరులు వీరి అన్యోన్య గౌరవ ప్రతిపత్తులను సహింపలేక రాజుగారికి పండితునికి యెడబాటు చేయతలచి రాజుగారి ఆస్థానమునకు వెళ్ళి మహారాజా మీ యాస్థాన పండితుడు చాలా మంచివాడు. ఆయన కుటుంబంలో చాలా చిక్కులున్నవి. ఆయన మీ యాస్థానమునకు వచ్చుటకు వీలులేక రాలేక అతి కష్టముతో వచ్చుచున్నాడు. గనుక కొంతకాలం సెలవివ్వవలయుననిరి. అంతట ఆ మహారాజుగారు వారు క్షేమముగా నుండుటయే మా లక్ష్యం. ఈనాటినుండి వారి చిక్కులు తీరునంతవరకు రావదని చెప్పండి యనిరి. అంతట అసూయకల వారందరు ఆ పండితుని యింటికి వెళ్ళి అయ్యా రాజుగారి సంస్థానములో అనేక చిక్కులు కలిగినవి. అవి చెప్పేవిగావు. మిమ్మల రావద్దని అనలేక వస్తుంటే చూస్తున్నారు. ఏ కారణమని మనం అడుగకూడదు. అందువలన మీరు కొంతకాలం రాజసంస్థానమునకు వెళ్ళకుంటా వుంటే బాగా వుండునని మా అభిప్రాయమని చెప్పిరి.

అంతట ఆ పండితుడు రాజుగారు క్షేమముగా నుండుటయే మనకు ముఖ్యము మీరు ఆప్తులు గనుక నాకు విషయం చెప్పిరని కొంతకాలం సంస్థానమునకు వెళ్ళనని ఆ పండితుడు రాజుగారి సంస్థానమునకు వెళ్ళుటకు మానివేసెను. ఆ తరువాత కొద్దిరోజులలో ఆ భర్తృ అను పండితునికి జబ్బుచేసి హఠాత్తుగా మరణించెనని ఆయన బ్రహ్మరాక్షసి

రూపముగా అనగా అదే పండితుని స్వరూపముతో తిరుగుచున్నాడని లోకంలో ప్రచారం చేసిరి. ఆయనకు జబ్బు చేయలేదు, చచ్చిపోలేదు. అప్పటినుండి ఆయన ఎక్కడ కనిపించినను బ్రహ్మరాక్షసియని వెళ్ళ కొట్టసాగిరి నేను బ్రహ్మరాక్షసిని కాను, నేను బ్రతికియున్నాను అని యెంత చెప్పినను ఈ బ్రహ్మరాక్షసియనే భావన అరూఢమయినది గనుక ఆయన మాట చెవిన పెట్టలేదు విశ్వసింపలేదు.

రాజసంస్థానములో ఆ పండితుడు మరణించి అదే విధముగా బ్రహ్మరాక్షసిగా తిరుగుచున్నాడు, మీ సంస్థానమునకు రానివ్వకండి. బ్రహ్మరాక్షసి ప్రవేశించినందువలన మీ రాజ్యమునకు హాని కలుగునని చెప్పిరి. ఈ పండితుడు కొంతకాలమైన తరువాత రాజుగారి సంస్థానమునకు వెళ్ళెను. బ్రహ్మరాక్షసి యని అందరు భయముతో రాజభటులు ఆయనను తోసివేసిరి. ఆయన అయ్యో! నేను మామూలు పండితుడనే, మరణించలేదు బ్రతికియేయున్నాను, నాయందు ఇటుల ప్రచారం చేసిరని ఎన్ని విధములుగా చెప్పినను నమ్మక తోసివేసిరి.

ప్రజలందరికిని అసంభావన, విపరీత భావన ఈ రెండు కలిగినవి. ఈయన బ్రప్పుకాడు అనునది అసంభావన. ఈయన బ్రహ్మరాక్షసే యనునది విపరీత భావన. ఈ రెండు భావనలు పాతుకుపోయినందున నిజము చెప్పినను నమ్మలేకపోయిరి. భర్పు పోనూలేదు, బ్రహ్మరాక్షసి కానూలేదు. వీళ్ళ భావన మాత్రమే.

అటులనే జీవులందరు పరమాత్మ స్వరూపులై అంతయు పరమాత్మ స్వరూపమై అనగా స్వప్రకాశ నిత్య అఖండానంద స్వరూపమై ఉన్నను, నేను పరమాత్మను కాను అను అసంభావన. నేను జీవుడను, జన్మ మరణములతో నున్నాను, జీవులు ఈశ్వరుడు ప్రపంచం వేరుగా సత్యముగా నున్నవను విపరీత భావన అనాది అజ్ఞాన వాసనలతో ఆరూఢమై యున్నది. అందువలన వేదమాత నాయనా! అంతయు పరమాత్మ స్వరూపమే. నీవు పరమాత్మ స్వరూపుడవు, నేను జీవుడనని ఈశ్వరుడు ప్రపంచం వేరుగా నున్నవని, జన్మమరణములలో నున్నామని భ్రమపడుచున్నావు నీ స్వరూపమే స్వప్నావస్థ యందు జీవేశ్వర

జగత్తులవలె కనిపించలేదా, మెఱుకువ రాగానే పోలేదా? ప్రపంచాదులవలన నీ స్వరూప సాక్షాత్కారం కలిగినపుడు ఈ భ్రమ పోవునని యెంత చెప్పినను మనకు అనాది సిద్ధ అసంభావనా విపరీత భావనల వలన శ్రవణం చేసినను త్వరగా బుద్ధికెక్కడంలేదు. సంక్షేప శారీరకంలో

శ్లో॥ పురుషాపరాధమలినాధి షణానిరవద్య చక్షురుదయాన
ఫలాయ భర్చు విషయా శ్రుతి సంభవాపి తధాత్మనిధీః

శ్లో॥ పురుషాపరాధ విగమేతు పునః ప్రతిబంధక వ్యుదసనా
త్స్వఫలా మణి మంత్ర యోర పసమేతుపు న్సతి
పావకాద్భవతి ధూమలతా॥

అని చెప్పిరి. అనగా పురుషాపరాధము అసంభావనా విపరీత భావనలు పోగానే బ్రహ్మ సాక్షాత్కారము కలుగును. మణి మంత్రములచేత అగ్నిని ప్రజ్వలించకుండా చేసినను మణిమంత్రములనే ప్రతిబంధకము లను తీసివేయగానే ధూమముతో అగ్ని ప్రజ్వలించును అని యర్థము.

జబ్బు పోయినంత వరకు మందు పుచ్చుకొనుచు పథ్యము చేసినట్లు సంసార భ్రమయను జబ్బు పోయేంత వరకు సదాచారమను పథ్యముతో తత్వవిచారము చేయవలెనని తాత్పర్యము. పరమాత్మ స్వరూపము పోనూ లేదు, జీవేశ్వర జగద్భావములు రానూలేదు. భావనామాత్రయేనని గ్రహించ వలెను. ఇట్టి గంభీరమైన తత్వజ్ఞానమును అతి శ్రద్ధతో సాధించవలెను అజ్ఞానమునకు ఆవరణ శక్తి,యనివిక్షేపశక్తియని 2శక్తులు కలవు. ఆవరణ శక్తి అసలు వస్తువును తెలియకుండా చేయును. విక్షేపశక్తి అసలు వస్తువును మరియొక వస్తువుగా కనిపించేటట్లు చేయును. వేదాంత శ్రవణం చేయువారందరికిని తెలిసిన విషయమే విక్షేపశక్తి కార్యమునకు ఆవరణ శక్తి మూలము. జ్ఞానము కలిగినపుడు ఆవరణయే ముందు నశించును. తరువాత విక్షేపము నశించును. ఈ రెండు శక్తులు జ్ఞానముచేత నశించును గనుక మిధ్యాభూతములని గమనించవలయును. ఉపనిషత్తులయందుగాని పురాణాదులయందుగాని జ్ఞానముచేత మోక్షము లభించునని జ్ఞానముచేత శోకము నివర్తించునని చెప్పిన ప్రకరణముల యందు బంధము అజ్ఞాన

కల్పితమని అది జ్ఞానముచేతనే నశించునని సమన్వయించవలయును. తాత్పర్యమును గ్రహించుటయే ముఖ్య శ్రవణము.

శ్రవణము చేసిన తరువాత ఆ తత్వమును అనేక యుక్తులతో దృఢముగా గ్రహించుట మననము శ్రవణమననములవలన అసంభావన విపరీత భావనలు తొలుగును జగన్మిథ్యాత్వ నిశ్చయానంతరం ద్వైత రహితమైన సచ్చిదానంద స్వరూపుడను నేను అని ధ్యానము చేయుట నిది ధ్యాసనము నిదిధ్యాసన వృత్తులు జ్ఞానరూప వృత్తులు ఉపాసనా వృత్తులు క్రియారూప వృత్తులు ధ్యేయమందు గుణములను ఆరోపించి చేయు ధ్యానము ఉపాసన గుణములను నిషేధించి అనగా లేదని యించి మిగిలిన అధిష్ఠానమును నేననుకొనుట నిధిధ్యాసము। శమదమాది అంతరంగ సాధనములు లేనిది శ్రవణాదులు లేనిది జ్ఞానము సిద్ధించదు.

కొద్ది పరోక్ష జ్ఞానము కలుగగనే మనం బ్రహ్మవేత్తలమని భ్రమించకూడదు. సాధనసంపత్తి కలదాయని విచారించవలెను. వివేక వైరాగ్యములను కూడా విచారించవలెను. బ్రహ్మ విచారమునకు రెండు ప్రక్రియలున్నవి ఒకటి పరిశోధనా ప్రకియ, రెండవది బాధ ప్రక్రియ। పరిశోధన యనగా ప్రపంచముకంటే శరీరేంద్రియములకంటే నేను వేరుగా నున్నానని విచారించుట। జ్ఞానరూపమగు ఆత్మలేనిది దృశ్యములేదని విచా రించుట బాధప్రక్రియ ఈ రెండు ప్రక్రియలను గుర్తించి విచారించిన యడల అద్వితీయమగు ఆత్మ నిశ్చయము కలుగును. ఈ గ్రంథములో ఆయా ప్రకరణ వ్యాఖ్యానములలో విశేషముగా వివరించినందున ఇపుడు సంగ్రహముగా వ్రాయుచున్నాను. ఇంకా వివరించిన ఈ గ్రంథము విస్తృతమగును చదువువారికి శ్రమకలుగును। సద్గురు పరదేవతానుగ్రహ మువలన కలిగిన జ్ఞానలేశముతో కొంత శ్రవణాభ్యాసం కలవారందరికిని ఉపయోగముగానుండుటకు వ్రాసిన విషయములనే దృఢము కాగలందు లకు వ్రాసితిని.

ఇదియునుగాక శంకరాచార్యులవారు లోకానుగ్రహముతో ఒక ప్రకరణంలో చెప్పిన విషయమును మరియొక ప్రకరణంలో కూడా చెప్పుటచేత ఆయా ప్రకరణములకు అర్థ వివరణము చేయునపుడు ఆ విషయములనే వివరించియుందును గాని వేరుకాదు ఈ గ్రంథమును జిజ్ఞాసువులు పూర్తిగా కొన్నిమార్లు చదివినయడల ప్రామాణికుల వద్ద శ్రవణం చేసిన విషయం దృఢపడునని సహృదయులు గ్రహించగలరని నా విశ్వాసము వ్రాతలోకాని ముద్రణలోకాని లోపములున్న విజ్ఞులు ఉదారభావముతో సరిచేసుకొని గ్రహింతురుగాక యని కూడా నా విశ్వాసము జీవన్ముక్తులై మహాయోగులై త్రికాలజ్ఞులగు శ్రీశ్రీశ్రీ జగద్గురువులగు కాంచీ కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వాములవారుకూడా ఈ గ్రంథమును వీక్షించిరి అనుగ్రహించిరికూడా గ్రంథమంతయు చదివి చివరన ఈ అద్వైత ప్రకరణ సంగ్రహమును ముఖ్యముగా చదువవలెనని ఆత్మీయ భావనతో తెలియచేయుచున్నాను.

శ్రీ శ్రీ శ్రీ జగద్గురుభ్యో నమః

సద్గురుభ్యో నమః

శ్రీ పరదేవతాయై నమః

ఇట్లు విబుధజన విధేయుడు

సద్గురు పరదేవతానుగ్రహాభిలాషి

మద్దులపల్లి మాణిక్యశాస్త్రి

విజయవాడ-2, గవర్నరుపేట.